# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 23, జులై 2026


## మేఘం కురిసే...
# రైతన్న మురిసే..!


- కర్షకుల శోకం చూసి కరుణించిన వరుణుడు
- వర్షాలకు జీవం పోసుకున్న పత్తిచేల్లు, వరి పొలాలు
- సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతలు



చెన్నూరు, జూలై 21, ప్రభాతవార్త

సినుకమ్మ ఓకసారి రావమ్మా అంటూ వర్షం కోసం కళ్ళల్లో వత్తులేసుకుని ఎదురుచూస్తూ, కడుపులోని దుఃఖాన్ని దిగమింగుతూ, సతమతమవుతున్న రైతులను చూసి వరుణుడు కరుణించాడు. మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా వర్షం కురుస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పత్తి చేళ్ళు నీరులేక మొక్కలు ఎండిపోయే దశలో వర్షం పడడంతో రైతులు ఆనంద పడుతున్నారు. కోటపల్లి మండలంలో కొన్ని చోట్ల వర్షాలు లేక మొక్కలు ఎండిపోవడంతో రెండు దఫాలుగా పత్తి విత్తనాలు వేశారు. సోమవారం నుంచి కురుస్తున్న వానలకు రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా వరిపంట సాగుచేసే రైతులు కొన్నిచోట్ల విత్తనాలు కొనే దశలోనే ఉన్నారు. చెన్నూరు మండలంలో బోరుబావులు ఎక్కువగా ఉన్నచోట వరి నాట్లు మొదలయ్యాయి. చెరువులు, కుంటల నీటిపై ఆధారపడే రైతులు మాత్రం నీరులేక నిశ్చేష్టులై ఉన్నారు.

## ప్రాణాలు బలిగొన్న నిర్లక్ష్యం..
# బ్యాటరీ పేలి బాలుడు మృతి





చింతలమానేపల్లి, జూలై 22, ప్రభాతవార్త

ఆడుతూపాడుతూ కళ్లముందు తిరగాల్సిన పసిగుడ్డు క్షణాల వ్యవధిలో జరిగిన అనూహ్య ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. బాలుడు చేసిన చిలిపి చేష్ట ప్రాణాల మీదికి తెచ్చి ఆ తల్లిదండ్రుల జీవితాల్లో తీరని విషాదం నింపింది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని గూడెం గ్రామంలో జరిగిన ఈ హృదయ విదారక ఘటన అందరినీ కంటతడి పెట్టించింది. గూడెం గ్రామానికి చెందిన నికాడి గణేష్ కుమారుడు లోకేష్ బుధవారం ఉదయం తన ఇంటిలో ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో అక్కడ పడి ఉన్న ఒక బ్యాటరీ ఆ బాలుడి కంటపడింది. పసి వయస్సు కావడంతో దాని ప్రమాదం గురించి తెలియని మిగతా 2లో..


# కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ నిరసన



– మందమర్రి, జూలై 22, ప్రభాతవార్త


- నల్ల బ్యాడ్జీలతో కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ హెచ్చరిక
- రాహుల్, ప్రియాంక అరెస్టును ఖండిస్తూ మందమర్రిలో కాంగ్రెస్ ఆందోళన

2లో..



# చినుకు పడితే చిత్తడే... డబుల్ రోడ్డు బురదమయం

- పెసరికుంట-కొత్మీర్ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం
- బురదలో జారుతున్న వాహనాలు
- ప్రజల అవస్థలు వర్ణనాతీతం
- బీటీ రోడ్డు వేసి రాకపోకలు పునరుద్ధరించాలని ప్రజల విజ్ఞప్తి





దహెగాం, జూలై 22,ప్రభాతవార్త:

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని పెసరికుంట–కొత్మీర్ డబుల్ రోడ్డు ప్రస్తుతం ప్రయాణికులకు నరకయాతనగా మారింది. డబుల్ రోడ్డు నిర్మాణ పనుల కోసం రోడ్డును తవ్వి మట్టి పోసి వదిలేయడంతో, గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా బురదమయమైంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడగా, ప్రజలు నిత్యావసర పనులకే వెళ్లలేని పరిస్థితి నెలకొంది.పెసరికుంట నుంచి కొత్మీర్ వరకు రోడ్డును విస్తరించే పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ పాత రోడ్డును తొలగించి మట్టి పోశారు. అయితే పనులను వేగంగా పూర్తి చేయకుండా మధ్యలోనే నిలిపివేయడంతో వర్షపు నీరు రోడ్డంతా నిలిచిపోయి బురదగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. పలుచోట్ల వాహనాలు బురదలో చిక్కుకుపోతుండగా, మరికొన్ని చోట్ల జారి పడుతున్నాయని స్థానికులు తెలిపారు.ఆటోలు, కార్లు, ఇతర చిన్న వాహనాలు కూడా ఈ మార్గంలో ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అత్యవసర సేవలకు వెళ్లే వాహనాలు సైతం నెమ్మదిగా ప్రయాణించాల్సి వస్తుండటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పాఠశాలలు, కార్యాలయాలు, ఆస్పత్రులకు వెళ్లే వారు ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని గ్రామస్తులు చెబుతున్నారు.కొత్మీర్ నుంచి దహెగాం మండల కేంద్రం వరకు నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే ఆలస్యమయ్యాయని, పనులు ప్రారంభించిన తర్వాత కూడా సరైన ప్రణాళిక లేకుండా తవ్వకాలు చేసి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. కనీసం తాత్కాలికంగా కంకర వేసి రాకపోకలు మిగతా 2లో..

# కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ నిరసన

**మందమర్రి, జూలై 22, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువత, మహిళలపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని విమర్శించారు. అదే విధంగా, ఆందోళనకు సంఘీభావం తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అలాగే ఎంపీ గడ్డం వంశీకృష్ణతో పాటు ఇతర ఎంపీల పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును తప్పుబట్టారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆ వాగ్దానాన్ని ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య హక్కులను అణిచివేస్తూ, ఈడీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష నాయకులను వేధిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ ప్రాంతీయ పార్టీలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల, విద్యార్థుల పక్షాన నిలుస్తుందని, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పుల్లూరి లక్ష్మణ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్, నాయకులు బండి సదానందం యాదవ్, డీసీసీ కార్యదర్శి గోపతి భానేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలి

### - మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్....

**తాండూర్, జూలై 22, ప్రభాతవార్త :**



పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను పోలీసులు సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకొని, సమాచార వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాలని మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా తాండూర్ పోలీస్ స్టేషన్ ను బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ తో కలిసి డిసిపి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ దేవయ్య, ఎస్ఐ ప్రసాద్, డీసీపీకి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ సెంటర్, రికార్డులను డిసిపి తనిఖీ చేశారు. స్టేషన్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో కేసుల వివరాల నమోదు, అప్‌లోడ్ ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల ఫైళ్లు, క్రైమ్ రికార్డులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ వ్యవహారాలపై సీఐ, ఎస్ఐలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. డీసీపీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాల ఫుటేజీని నిరంతరం పర్యవేక్షి స్తూ శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల్లో చట్టాలపై, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై, సైబర్ నేరాల పట్ల అప్రమత్తతపై అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. అలాగే రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్, సీటు బెల్టు ధరించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, వాటి ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలు, గ్రామ పంచాయతీలు, జాతీయ రహదారి ప్రాంతాల్లో ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థతో పాటు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## కొత్తపల్లిలో ఆధార్ కేంద్రం ప్రారంభం

**తాండూర్, జూలై 22, ప్రభాతవార్త :**

మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆధార్ కేంద్రాన్ని సర్పంచ్ ఆకుల వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆధార్ కార్డు లేని వారు ప్రతి ఒక్కరు తమ పిల్లలకి ఆధార్ కార్డు తీసుకోవాలని, ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ లింక్ లేకున్న, అడ్రస్సు గాని, ఏమైనా తప్పులు ఉన్న సవరించుకోని ఆధార్ కార్డును అప్డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ లక్ష్మణ్, వార్డ్ మెంబర్ జంబోజుల ప్రవీణ్, ఆధార్ కేంద్రం ఆపరేటర్ గూడూరు వినయ్, తదితరులు పాల్గొన్నారు.



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ ఆకులు వెంకటేష్

## గాంధీ విగ్రహం ముందు కాంగ్రెస్ నాయకుల నిరసన

**తాండూర్, ప్రభాతవార్త :**



తాండూర్ మండలం మాదారంలోని గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నల్ల బ్యాడ్జిలు ధరించి శాంతియుత నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు పెద్దబోయిన శంకర్ మాట్లాడుతూ ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజ్ విషయం లో విద్యార్థులు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తే కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో విద్యార్థుల మీద లాటి ఛార్జ్ చేయడం సిగ్గు చేటన్నారు. విద్యార్థులు లాఠీచార్జి, రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీని అరెస్టు అరెస్ట్ చేయడం ప్రజాస్వామికమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నవీన్ పటేల్, మదారం సర్పంచ్ లక్ష్మణ్, ఉప సర్పంచ్ దామోదర్ రెడ్డి, నాయకులు భీమా రాజు కుమార్, పుట్ట శ్రీనివాస్, ఇందూరి సత్యం, కొండగోర్ల అంజి, జోగిరాల రమేష్, తోట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అంతరాష్ట్ర రహదారిపై ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## కాంగ్రెస్ రాస్తారోకో.. నీట్ అంశంపై కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకున్న నాయకులు

**ఆసిఫాబాద్, జూలై 22, ప్రభాతవార్త :**

నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ అరెస్టు, నీట్ అంశంపై నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జీని ఖండిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద రోడ్ పై జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లు కళ్ళకు కట్టుకుని ఆందోళన నిర్వహించిన అనంతరం గాంధీ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, నీట్ పేపర్ లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డి సి సి అధ్యక్షురాలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వారిపై లాఠీచార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను అణచివేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ అజ్మీర శ్యామ్ నాయక్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, ఆసిఫాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, ఆసిఫాబాద్ మండలం సర్పంచ్ సంఘం అధ్యక్షులు టెకం గంగారాం, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్ , సర్పంచ్ లు, ఆసిఫాబాద్ మునిసిపాలిటీ కౌన్సిలర్లు, డిసిసి కార్యవర్గ సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, గ్రామ వార్డ్ మెంబెర్స్, జిల్లా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రాణాలు బలిగొన్న నిరక్ష్యం..

## బ్యాటరీ పేలి బాలుడు మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఆ బాలుడి, ఆటలాడుతూ ప్రమాదవశాత్తు నోటితో గట్టిగా కొరికాడు. ఊహించని విధంగా ఆ బ్యాటరీ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోయింది. ఈ ఘోర ప్రమాదంలో బాలుడి ముఖం, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో విలవిల్లాడుతున్న కొడుకు ను చూసి కుటుంబ సభ్యులు లబోదిబోమన్నారు. వెంటనే ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, మార్గమధ్యలోనే ఆ పసిప్రాణం గాలిలో కలిసిపోయింది. కళ్లముందే కొడుకు విగతజీవుడిగా మారడాన్ని తట్టుకోలేక తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్న తీరు అక్కడివారందరినీ కలచివేసింది. అర్ధాంతరంగా బాలుడి తనువు చాలించడంతో గూడెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే కౌటాల సీఐ సంతోష్, ఎస్సై కమలాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## చినుకు పడితే చిత్తడే... డబుల్ రోడ్డు బురదమయం

(మొదటిపేజీ తరువాయి)

సాఫీగా సాగేలా చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎప్పుడైనా పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి డబుల్ రోడ్డుపై కంకర వేసి బురదను తొలగించి వాహనాల రాకపోకలు పునరుద్ధరించడంతో పాటు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పెసరికుంట, కొత్మీర్ గ్రామాల ప్రజలు, వాహనదారులు, రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## కష్టపడి ఇష్టపడి చదివితేనే భవిష్యత్తు: ఎస్సై శ్రీకాంత్

**కెరమెరి, ప్రభాతవార్త:**



విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి ఇష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు బుధవారం హట్టి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు సైబర్ భద్రత, రక్షణ చట్టాలు, మత్తు పదార్థాల నివారణపై జిల్లా ఎస్పీ నికితా పంత్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్ భాగంగా కళాజాత సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదివితే తప్పకుండా మంచి భవిష్యత్తు సాధించగలరని, చదువుకునే సమయంలో చెడు అలవాట్లు, చెడు ఆలోచనలకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాను అవసరమైన మేరకే వినియోగించాలని, గుర్తుతెలియని వ్యక్తులు పంపిన లింకులను ఓపెన్ చేయరాదని, బ్యాంకు వివరాలు, ఓటీపీ, పిన్ నంబర్లు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాల బారిన పడిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలాగే బాలల రక్షణ చట్టాలు , పోక్సో చట్టం, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, గంజాయి తదితర మత్తు పదార్థాల దుష్పరిణామాలు, మైనర్ డ్రైవింగ్, డయల్100 ప్రాముఖ్యత, చిన్నారుల భద్రత, కొత్త చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోనేరావు, ఆసిఫాబాద్ కళాబృందం సభ్యులు రోహిత్, రాంచందర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, రజిత, సంఘవి పాల్గొన్నారు.

### వార్త కథనానికి స్పందన..

## కలెక్టర్ చొరవతో డాక్టర్ నియామకం

### - బజార్‌హత్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి డాక్టర్ నవీన్‌రెడ్డి నియామకం

**బజార్‌హత్నూర్, జులై 22, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల కొరతపై ప్రభాతవార్తలో ప్రచురితమైన వార్త కథనానికి అధికారులు తక్షణమే స్పందించారు. ఈ నెల 17న "ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లను నియమించాలి" అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేక చొరవ చూపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం బజార్ హత్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి డాక్టర్ నవీన్ రెడ్డిని నియమించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నవీన్ రెడ్డిని స్థానిక సర్పంచ్ పరచ సాయన్న, బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు డి. చంద్రశేఖర్, మండల ప్రజలు కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆస్పత్రి సమస్యపై స్పందించి వెంటనే వైద్యుడిని నియమించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు, ప్రజల సమస్యను వెలుగులోకి తెచ్చిన ప్రభాతవార్త యాజమాన్యానికి మండల ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రైలు నుంచి జారిపడి యువ కార్మికుడి మృతి

మందమర్రి, జూలై 22, ప్రభాతవార్త



కేరళకు రైలులో ప్రయాణిస్తున్న ఓ యువ కార్మికుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందపడటంతో మృతి చెందిన ఘటన మందమర్రి రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, బీహార్ రాష్ట్రానికి చెందిన మణి భూషణ్ కుమార్ (22), తండ్రి బాలేశ్వర్ రామ్, ఉపాధి నిమిత్తం కేరళకు రైలులో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందపడిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన అతను అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



## పోచమ్మ తల్లికి ఘనంగా అభిషేకం, ఓడి బియ్యం కార్యక్రమం

### - అధిక సంఖ్యలో హాజరైన భక్తులు


మందమర్రి, జూలై 22, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలోని రెండో జోన్ 13వ వార్డు పరిధిలోని పోచమ్మ ఆలయంలో బుధవారం వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి అభిషేకం, ఓడి బియ్యం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన పూజా కార్యక్రమాలు భక్తిపారవశ్య వాతావరణాన్ని సృష్టించాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వెలుగు సమాఖ్య సభ్యులు, మహిళలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పోచమ్మ తల్లి ఆశీస్సులు పొందారు.

## మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల్లో కలెక్టర్ విస్తృత పర్యటన

బెల్లంపల్లి, జూలై 22, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా పరిపాలనలో భాగంగా కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం రోజున మందమర్రి, బెల్లంపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ రెవెన్యూ, భూసంబంధిత అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముందుగా మండల తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్, భూభారతి, సాదా బైనమా, అలాగే రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు పెండింగ్‌లో ఉండకుండా, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు సమయానికి సేవలు అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోదని హెచ్చరించారు. తదనంతరం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి వివిధ రకాల దరఖాస్తుల పరిష్కార విధానాన్ని సమీక్షించారు. ప్రతి దరఖాస్తు నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం రెండూ ముఖ్యమని పేర్కొన్నారు. ఇకపోతే సింగరేణి సంస్థకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపై కూడా కలెక్టర్ దృష్టి సారించారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్, కాసిపేట మండల తహసీల్దార్ సునీల్, సింగరేణి మందమర్రి మరియు గోలేటి ఏరియాల జనరల్ మేనేజర్లతో కలిసి కాసిపేట ప్రాంతంలో ప్రతిపాదిత నూతన ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ స్థలాన్ని పరిశీలించారు. ప్రాజెక్ట్ అమలు వల్ల కలిగే లాభాలు, భూసేకరణ, పర్యావరణ అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అదేవిధంగా తాండూర్ మండలంలో తహసీల్దార్ జ్యోత్స్న, గోలేటి ఏరియా అధికారులతో కలిసి మరో ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించి భౌగోళిక పరిస్థితులు, అభివృద్ధి అవకాశాలపై వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, సింగరేణి ప్రతినిధులు పాల్గొన్నారు.



# తానూర్ పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటిన జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల

### మహారాష్ట్ర సరిహద్దు భద్రతకు మరింత పదును - వార్షిక తనిఖీ నిర్వహించి సరిహద్దు భద్రత, నేర నియంత్రణపై దిశానిర్దేశం

భైంసా, జులై 22, ప్రభాతవార్త:



మొక్కలు నాటుతున్న జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల, చిత్రంలో ఏఎస్పీ సాయి కిరణ్, పోలీసు అధికారులు

వన మహోత్సవం-2026 కార్యక్రమంలో భాగంగా తానూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ జి. జానకి షర్మిల బుధవారం మొక్కలు నాటారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని ముధోల్ సర్కిల్ పరిధిలోని తానూర్ పోలీస్ స్టేషన్‌కు విచ్చేసిన జిల్లా ఎస్పీకి పోలీసు అధికారులు పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసు గార్డ్ ద్వారా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని సుమారు 300 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, నాటిన ప్రతి మొక్కను పెంచి సంరక్షించినప్పుడే వన మహోత్సవం లక్ష్యం సార్థకమవుతుందని తెలిపారు. అనంతరం తానూర్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించి స్టేషన్ పరిపాలన, శాంతిభద్రతల నిర్వహణ, నేర నియంత్రణ, రికార్డులు, బీట్ వ్యవస్థ, సీసీ కెమెరాల పనితీరు, ఆయుధాగారం, దర్యాప్తు పురోగతి తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల విశ్వాసమే పోలీసు శాఖకు అతిపెద్ద బలమని, ఫిర్యాదుదారులకు సత్వర, పారదర్శక సేవలు అందించాలని సూచించారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్న తానూర్ స్టేషన్‌కు వ్యూహాత్మక ప్రాధాన్యత ఉందని తెలిపారు. అంతర్‌రాష్ట్ర నేరాల నియంత్రణకు చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు కట్టుదిట్టం చేయాలని, అక్రమ మద్యం, గంజాయి, పశువుల రవాణాను అరికట్టాలని ఆదేశించారు. మహారాష్ట్ర పోలీసులతో సమన్వయం బలోపేతం చేసుకుని నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. గంజాయి, గుడుంబా నిర్మూలనపై దృష్టి సారించాలని, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ముధోల్ సీఐ రవీంద్ర నాయక్, తానూర్ ఎస్ఐ షేక్ జుబేర్ ఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## బాసర ట్రిబుల్ ఐటీలో నాణ్యమైన విద్యనందించాలి

### - విద్యార్థులు ఉద్యోగాలు పొందేలా నైపుణ్యాభివృద్ధి ఆధారిత విద్యాబోధన

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

భైంసా, జులై 22, ప్రభాతవార్త:

నిర్మల్ జిల్లా బాసర ట్రిబుల్ ఐటీలో విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తిచేసి బయటకు వెళ్లే సమయానికే మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందేలా నైపుణ్యాభివృద్ధి ఆధారిత విద్యాబోధన అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం బాసర ట్రిబుల్ ఐటీ క్యాంపస్‌ను సందర్శించిన ఆయన, విశ్వవిద్యాలయ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పరిశ్రమలకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించేలా ప్రత్యేక విద్యా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుంటూ విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలకు పోటీపడే స్థాయికి తీర్చిదిద్దాలని తెలిపారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల సమస్యలు ఏవైనా దృష్టికి వస్తే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. క్యాంపస్‌లో నిరంతర విద్యుత్ సరఫరా, సురక్షితమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. అకాడమిక్, డిజిటల్, క్రీడా సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్యాంపస్ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం బాసరలో నూతనంగా నిర్మించతలపెట్టిన తహసీల్దార్ కార్యాలయ స్థలాన్ని కలెక్టర్ నిశితంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ట్రిబుల్ ఐటీ ఉపకులపతి గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్, తహసీల్దార్ పవన్ చంద్ర, విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి టీకా కేంద్రంలో నిబంధనలు తప్పనిసరి.. చిన్నారుల ఆరోగ్య రక్షణే ప్రధాన లక్ష్యం

### - టీకా నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేదు..

### - సిబ్బంది అన్ని మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశం

మంచిర్యాల, జూలై 22, ప్రభాతవార్త



జిల్లాలో నిర్వహించే ప్రతి టీకా కార్యక్రమంలో జాతీయ టీకాల కార్యక్రమ మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. ప్రతి టీకా కేంద్రంలో అవసరమైన సామగ్రి, మందులు, అత్యవసర చికిత్స పరికరాలు అందుబాటులో ఉంచి, నిర్ణీత నిబంధనల మేరకు సేవలు అందించాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది. టీకా పెట్టెతో పాటు శీతలీకరణ పలకలు, అన్ని రకాల టీకాలు, వాటికి సంబంధించిన ద్రావకాలు, గడువు తేదీలను ముందుగానే పరిశీలించి మాత్రమే వినియోగించాలని సూచించింది. ప్రతి టీకా కేంద్రాన్ని ఉదయం నిర్ణీత సమయానికి ప్రారంభించి సాయంత్రం వరకు నిర్వహించడంతో పాటు, ఆ రోజు టీకా తీసుకోవాల్సిన చిన్నారులు లేకపోయినా కేంద్రాన్ని నిర్వహించాలని పేర్కొంది. టీకా కార్యక్రమంలో అవసరమైన నమోదు పుస్తకాలు, చిన్నారుల వివరాల జాబితా, సురక్షిత వ్యర్థాల నిర్వహణకు అవసరమైన సామగ్రి, అత్యవసర చికిత్స పెట్టె తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించింది. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే మందులు గడువు ముగియకుండా ఉండటంతో పాటు వైద్యాధికారి ధ్రువీకరణ పత్రం కూడా ఉండాలని స్పష్టం చేసింది. తెరిచిన టీకా సీసాల వినియోగానికి సంబంధించిన నిబంధనలను తప్పకుండా పాటించాలని, కొన్ని టీకాలను నిర్ణీత గంటల వ్యవధిలోనే వినియోగించాలని, మరికొన్ని టీకాలకు అమలులో ఉన్న విధానాలను కచ్చితంగా అనుసరించాలని సూచించింది. ప్రతి టీకా అనంతరం వివరాలను వెంటనే తల్లి-శిశు ఆరోగ్య కార్డులో, సంబంధిత నమోదు పుస్తకాల్లో, ఆన్‌లైన్ నమోదులో నమోదు చేయాలని తెలిపింది. టీకా వేయించుకునేందుకు వచ్చే తల్లిదండ్రులకు టీకా వల్ల కలిగే ప్రయోజనాలు, స్వల్ప దుష్ప్రభావాలు, తదుపరి మోతాదు తేదీ, ఆరోగ్య కార్డు తీసుకురావాల్సిన అవసరం, చేతుల పరిశుభ్రత, తొలి ఆరు నెలలు తల్లిపాల ప్రాధాన్యంపై తప్పనిసరిగా అవగాహన కల్పించాలని ఆదేశించింది. అలాగే టీకా అనంతరం ప్రతి చిన్నారిని కనీసం అరగంటపాటు టీకా కేంద్రం వద్దే పరిశీలనలో ఉంచాలని సూచించింది. చిన్నారుల ఆరోగ్య రక్షణలో టీకాలు కీలకమని, అందువల్ల ప్రతి ఆరోగ్య కార్యకర్త నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా టీకాల కార్యక్రమ అధికారి సూచించారు.

# రైల్వే లోకో పైలట్ల ధర్నా

## 120 కిలోమీటర్ మైలేజి రన్నింగ్ స్టాఫ్‌కు ఇవ్వాలని డిమాండ్

**బెల్లంపల్లి, జూలై 22, ప్రభాతవార్త**

దక్షిణ మధ్య రైల్వేలో పనిచేస్తున్న రన్నింగ్ స్టాఫ్‌కు 120 కిలోమీటర్ మైలేజ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో లోకో పైలట్స్ బుధవారం బెల్లంపల్లి క్రూలాబీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ బెల్లంపల్లి బ్రాంచ్ ఛైర్మన్ ఎస్ నాగరాజు, సెక్రెటరీ జి సాంబశివుడు మాట్లాడారు. సిగ్నల్ నుంచి సిగ్నల్ ఆఫ్ చేసిన వెంటనే మైలేజి ఇవ్వాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైల్వే వ్యవస్థకు మూలకారణమైన లోకో పైలట్ షిఫ్ట్ నెలలో 4 కాకుండా 2 కు తగ్గించాలని, 36 గంటల్లో పైలట్స్ హెడ్ క్వార్టర్స్ కువచ్చే విధంగా నిబంధనలు కేంద్ర ప్రభుత్వం అమలు పర్చాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో పైలట్స్ 70 గంటలు పనిచేయాల్సి వస్తుందని లోకో పైలట్స్ పై కేంద్ర ప్రభుత్వం అధిక పని భారం మోపుతుందని పేర్కొన్నారు. బెల్లంపల్లి, బల్లార్షా, రామగుండం, పంద్రపాణి రైల్వే గూడ్స్ డిపోల్లో గల రన్నింగ్ రూమ్స్ నుఆధునికరించిఅభివృద్ధిపర్చాలని, వాటిలో మహిళా లోకో పైలట్లకు తగు సౌకర్యాలు కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోకో పైలట్స్ 25 శాతం కిలోమీటర్ ఫర్ అలవెన్స్ చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. రైల్వే లోకో పైలట్లకు డిపోలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సౌత్ సెంట్రల్ మద్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్ రావు, సీనియర్ నాయకుడు రవీందర్‌లు ఇచ్చిన పిలుపులో భాగంగా బెల్లంపల్లి లో నిర్వహించిన ధర్నాలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కోశాధికారి షోకేష్ మీనా నాయకులు సీహెచ్ హేమ, పీ, ఎస్ షా, సాగర్ భట్, ధీరజ్ అగర్వాల్, వివేక్, రామ్ లఖన్ లాల్ పెద్ద సంఖ్యలోకో పైలట్ పాల్గొన్నారు.




## నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో పోరాడుతున్న నేతపై అక్రమ అరెస్ట్: భోంస్లే నారాయణ్ రావు పటేల్

**భైంసా, జులై 22, ప్రభాతవార్త:**



నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంలో విద్యార్థులకు అండగా నిలుస్తూ పోరాటం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ భైంసా పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముధోల్ నియోజకవర్గ ఇంచార్జ్ భోంస్లే నారాయణ్ రావు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోంస్లే నారాయణ్ రావు పటేల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రాహుల్ గాంధీకి సంఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## సాయినగర్ తండాలో డ్రైనేజీ పనులు ప్రారంభం

- రూ.20 లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మాణం
- సర్పంచ్ సాబ్లే సరిత గోపాల్ సింగ్

**సారంగాపూర్, జులై 22, ప్రభాతవార్త:**




మండలంలోని సాయినగర్ తండాలో బుధవారం రూ.20 లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ సాబ్లే సరిత గోపాల్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తండాలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి తండావాసులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. గ్రామాభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాబ్లే నానక్ సింగ్, దేవిసింగ్, ఝుక్య నాయక్, గణపతి, ధరం సింగ్, రవి ప్రకాష్, గజేందర్ మరియు తండా గ్రామస్థులు పాల్గొన్నారు.

## హాస్టల్‌లో దందా బహిర్గతం.. పేద గిరిజన విద్యార్థులపై వార్డెన్ దోపిడి!

- స్కాలర్‌షిప్ పేరిట రూ.600 వసూళ్లు
- విద్యార్థి సంఘాల ఆగ్రహం, తక్షణ సస్పెన్షన్ డిమాండ్

**బెల్లంపల్లి, జూలై 22, ప్రభాతవార్త**




మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ ట్రైబల్ బాయ్స్ హాస్టల్‌లో జరుగుతున్న అక్రమ వసూళ్ల వ్యవహారం వెలుగులోకి రావడంతో తీవ్ర కలకలం రేగింది. స్కాలర్‌షిప్ డబ్బులు వస్తాయని నమ్మబలికి, అప్లికేషన్ పేరుతో ఒక్కో విద్యార్థి వద్ద నుంచి రూ.600 చొప్పున డబ్బులు వసూలు చేస్తున్న వార్డెన్‌పై ఐక్య విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ మేరకు ఏటీడీఓ అధికారికి ఫిర్యాదు అందజేస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. విద్యార్థి నాయకులు మండిపడుతూ, రెక్కాడితే గానీ డొక్కాడని పేద గిరిజన విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మోసపూరితంగా డబ్బులు దోచుకోవడం అమానుషం. విద్య కోసం హాస్టల్‌లో చేరిన పిల్లల్ని దోపిడీ చేయడం క్షమించరాని నేరం అని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వమే ఉచితంగా అందించాల్సిన సేవలను సైతం డబ్బులు వసూలు చేసి అందించడం అత్యంత దారుణమని అన్నారు. అంతేకాకుండా, వార్డెన్ తనకు అనుకూలంగా కొంతమంది విద్యార్థులను ఏర్పాటు చేసుకుని, వారితోనే ఈ అక్రమ వసూళ్లు చేయిస్తున్నాడని ఆరోపించారు. ఇది ఒక వ్యవస్థీకృత దందాగా మారింది. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి అంటూ మండిపడ్డారు. ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నుండి అక్రమంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించడంతో పాటు, ఇలాంటి ఘటనలు జిల్లాలో ఎక్కడా పునరావృతం కాకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హాస్టల్‌లలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, పేద విద్యార్థుల హక్కులను కాపాడాలని విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి. ఈ కార్యక్రమంలో చిప్పకుర్తి శ్రీనివాస్ టీవీయువి చేరాల వంశీ, జేవీఎస్ రేగుంట క్రాంతి కుమార్, టీవీఎస్ బచ్చలి అభిరామ్, ఎన్‌ఎస్సి అవునురి ప్రసాద్, ఏబిఎస్‌ఎఫ్ సాగర్, విద్యార్థి నిరుద్యోగ జేఏసీ తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢ సంబరాలకు మహిళల సందడి

### మంచిర్యాల జిల్లా కేంద్రంలో సాంప్రదాయ వేడుకలు ఘనంగా నిర్వహణ

**మంచిర్యాల, జూలై 22, ప్రభాతవార్త**



ఆషాఢ మాసం సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో గోరింటాకు వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని గోరింటాకు పెట్టించుకుంటూ ఆషాఢ మాసపు ఆచారాలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఒకరికి ఒకరు గోరింటాకు పెట్టుకుంటూ సంప్రదాయ పాటలు పాడారు. వివాహిత మహిళలు తమ కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సౌభాగ్యం కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. పండుగ వాతావరణంలో చిన్నారులు, యువతులు కూడా ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో కోడికాళ్ల శశిరేఖ, కోలిపాక కావ్య, సరిత, లావణ్య తదితర మహిళలు పాల్గొని గోరింటాకు ప్రాముఖ్యతను వివరించారు. భారతీయ సంస్కృతిలో గోరింటాకు మహిళల అందానికి ప్రతీక మాత్రమే కాకుండా ఆరోగ్యపరంగా కూడా ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం శుభప్రదమని, ఇది చల్లదనాన్ని కలిగించి మానసిక ప్రశాంతతను అందిస్తుందని పేర్కొన్నారు. సంప్రదాయాలను భావితరాలకు చేరవేయాలంటే ఇలాంటి వేడుకలను ప్రతి ఏడాది నిర్వహించాలని మహిళలు అభిప్రాయపడ్డారు. మొత్తానికి మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన గోరింటాకు ఆషాఢ మాస సంబరాలు మహిళల సందడి, సంప్రదాయ సోయగం, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచాయి.

## రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి: కాంగ్రెస్ ఆగ్రహం

- గాంధీ విగ్రహం వద్ద నిరసన.. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై కేంద్రం బాధ్యత వహించాలని డిమాండ్

**మంచిర్యాల, జూలై 22, ప్రభాతవార్త**

భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కేంద్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మంచిర్యాల కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ పార్క్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం అచల భారత కాంగ్రెస్ కమిటీ, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకత్వం, మంచిర్యాల శాసన సభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆదేశాల మేరకు జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల నరేష్, మేయర్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న వారిపై కేంద్ర ప్రభుత్వం నిర్బంధ చర్యలకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఢిల్లీలో నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ అంశంపై విద్యార్థులు చేపట్టిన శాంతియుత ఆందోళనపై లాఠీచార్జి చేయడం అత్యంత బాధాకరమని అన్నారు. విద్యార్థులు, రైతులు, యువత, నిరుద్యోగులు, మహిళల సమస్యలను ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడం ప్రజల గొంతుకను అణిచివేసే ప్రయత్నమేనని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడడం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ సంబంధిత కేంద్ర మంత్రి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



## ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు శుభాకాంక్షలు తెలిపిన మహాగం ప్రజలు

### - మహాగంలో 10 ఎకరాల్లో గిడ్డంగుల నిర్మాణానికి పంచనామా పూర్తి

**భైంసా, జులై 22, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని మహాగం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో 10 ఎకరాల విస్తీర్ణంలో గోదాముల నిర్మాణం చేపట్టేందుకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం తరఫున పంచనామా ప్రక్రియ పూర్తయింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. మహాగం గ్రామ సర్పంచ్ అప్పల రాజ్యలక్ష్మి రాకేష్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో గోదాముల నిర్మాణం చేపట్టడం ద్వారా గ్రామాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందన్నారు. భవిష్యత్తులో రైతులకు తమ పంట ఉత్పత్తులను దాచుకోవడానికి, స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. మహాగం అభివృద్ధి దిశగా ఇది మరో ముందడుగు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దత్తు, మండల రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఓటరు సవరణ ప్రక్రియ పూర్తి చేసుకున్న ప్యారామూర్

### - 100 శాతం ప్రక్రియ పూర్తి చేసిన సిబ్బందిని అభినందించిన సర్పంచ్ మాకునూర్ వరలక్ష్మి

**సారంగాపూర్, జులై 22, ప్రభాతవార్త:**

మండలంలోని ప్యారామూర్ గ్రామ పంచాయతీలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా 37వ పోలింగ్ బూత్‌కు సంబంధించి మరణించిన వారు, ఇల్లు మారిన వారు, తొలగించాల్సిన పేర్ల వివరాలపై అందరి సమక్షంలో గ్రామసభ నిర్వహించి ఆమోద ముద్ర వేశారు. అనంతరం సంబంధిత నివేదికలను జీపీఓ సవిత రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో గ్రామంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ 100 శాతం పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. సవరణ ప్రక్రియను సమర్థవంతంగా, వేగంగా పూర్తి చేసిన ఉద్యోగులను, బిఎల్ఓలను గ్రామ సర్పంచ్ మాకునూర్ వరలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేందర్ సింగ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, బిఎల్ఓ సునీత, బిఎల్ఏలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జులై 22, ప్రభాతవార్త**



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సిఐ గోపతి రవీందర్‌తో కలిసి సందర్శించి భద్రతా చర్యల్లో భాగంగా సిసి కెమెరాల ఏర్పాటు, భోజనశాల, వంటశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల భద్రత దృష్ట్యా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ బి.పి.సి. విద్యార్థులతో మాట్లాడుతూ విద్యా బోధన నాణ్యత పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసీల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించారు. ప్రజల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో జాగ్రత్త వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రక్రియ వేగవంతానికి బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సహకారం తీసుకోవాలని తెలిపారు. భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చందునాయక్ తండాలో కార్డన్ సెర్చ్: 85 వాహనాలు సీజ్

### - అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి: బోథ్ సీఐ

**బజార్‌హత్నూర్, జులై 22, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు బజార్ హత్నూర్ మండల పరిధిలోని చందునాయక్ తండాలో బోథ్ సీఐ గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు ముమ్మరంగా కార్డన్ సెర్చ్ తనిఖీలు నిర్వహించారు. తండాను నలువైపులా దిగ్బంధించిన పోలీసులు ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 75 ద్విచక్ర వాహనాలు, 10 ఆటోలు కలిపి మొత్తం 85 వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ గురుస్వామి తెలిపారు. వాహనాల పెండింగ్ చలానాలను చెల్లించి, సంబంధిత ధ్రువపత్రాలను చూపించి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల రక్షణ, భద్రతే ధ్యేయంగా పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. పాత నేరస్థులు తమ ప్రవర్తన మార్చుకోవాలని, గొడవలకు దిగే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్డన్ సెర్చ్ తనిఖీల్లో బజార్ హత్నూర్, బోథ్, గుడిహత్నూర్, నేరడిగొండ, సిరికొండ పోలీసు స్టేషన్లకు చెందిన ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై తక్షణమే పునఃసమీక్ష చేపట్టాలి: ఏఐటీయూసీ

### - శ్రీరాంపూర్ ఏరియా వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గనులపై ధర్నాలు

**నస్పూర్, జులై 22, ప్రభాతవార్త**

ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై యాజమాన్యం తక్షణమే పునఃసమీక్ష చేపట్టి బాధిత కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపు మేరకు బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాల వద్ద కార్మికులు భారీ ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సుమారు 2,000 మంది కార్మికులు బోర్డు కోసం ఎదురుచూస్తుంటే కేవలం 120 మందికే అవకాశం ఇచ్చి, అందులో 24 మందినే ఇన్వాలిడేషన్‌కు ఎంపిక చేయడం అత్యంత అన్యాయమని నాయకులు విమర్శించారు. అండర్‌గ్రౌండ్‌లో దశాబ్దాలుగా పనిచేస్తూ తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న కార్మికుల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించలేదని మండిపడ్డారు. అవసరమైతే ప్రస్తుత బోర్డును రద్దు చేసి నిపుణులైన వైద్యులతో తిరిగి బోర్డు నిర్వహించాలని, పెండింగ్ దరఖాస్తుల కోసం నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విధులు నిర్వహించలేని వారికి ఇన్వాలిడేషన్ ఇచ్చి వారి వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనల్లో ఏఐటీయూసీ నాయకులు కందికట్ల వీరభద్రయ్య, ఎస్‌కే బాజీ సైదా, కొట్టె కిషన్‌రావు, మోత్కూరి కొమరయ్యతో పాటు బ్రాంచ్ నాయకులు, ఆఫీస్ బేరర్స్, అన్ని గనుల పిట్ సెక్రటరీలు, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా దాశరథి జయంతి వేడుకలు

### సిర్గాపూర్ ప్లేయర్ పాఠశాలలో ఘనంగా మహాకవి స్మరణ

**నిర్మల్, జులై 22, ప్రభాతవార్త:**



దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్ లోని ప్లేయర్ పాఠశాలలో మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. తెలంగాణ ఆత్మగౌరవానికి అక్షర రూపమిచ్చిన మహాకవి జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు దాశరథి సాహిత్య సేవలు, దేశభక్తి, తెలంగాణ పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమను వివరిస్తూ కవితలు, ఉపన్యాసాలు వినిపించారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని ఆయన గర్వంగా చాటిన మాటలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ కుంట వెంకట నరసింహారెడ్డి మాట్లాడుతూ.. దాశరథి ఆశయాలను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆయన రాసిన తెలంగాణ ఉద్యమ గీతాలు నేటికీ యువతలో నిరంతర స్ఫూర్తిని నింపుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నివాళులర్పించారు. దేశభక్తి గీతాల ఆలపనతో కార్యక్రమం ముగిసింది.

# మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు బ్యాంకులు కీలకం

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**మంచిర్యాల, జూలై 22, ప్రభాతవార్త**

మహిళా సంఘాల ఆర్థిక సాధికారతలో బ్యాంకులు కీలకపాత్ర పోషిస్తాయని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతను మరింత బలోపేతం చేయడం, బ్యాంక్ లింకేజీ ప్రక్రియను వేగవంతం చేయడం, మహిళా సంఘాలకు సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులు-సెర్ప్ మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెర్ప్ డే ఎన్.ఆర్.ఎల్.ఎం. స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజ్ అంశంపై ఒకరోజు అవగాహన శిక్షణా కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర మాట్లాడుతూ, మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధిలో బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల విజయవంతమైన అమలుకు బ్యాంకులు, సెర్ప్ అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు సకాలంలో, అవసరమైన మేరకు రుణాలు మంజూరు చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. బ్యాంక్ లింకేజ్, రుణాల మంజూరు, క్రెడిట్ లిమిట్ల పునరుద్ధరణ, పెండింగ్ రుణ దరఖాస్తుల సత్వర పరిష్కారం, వార్షిక రుణ లక్ష్యాల సాధన, మహిళా సంఘాలకు నాణ్యమైన ఆర్థిక సేవలను మరింత సమర్థవంతంగా అందించే విధానాలపై సమగ్రంగా శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. బ్యాంకులు-సెర్ప్ మధ్య మరింత సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం నిర్దేశించిన మహిళా స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజ్ లక్ష్యాలను విజయవంతంగా సాధించాలని, ప్రతి మహిళా సంఘానికి అవసరమైన బ్యాంకింగ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రతి బ్యాంకు తన వంతు సహకారం అందించాలని తెలిపారు.



### వర్షాకాలంలో పారిశుద్ధం, నీటి పారుదలపై ప్రత్యేక దృష్టి సారించాలి..

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్‌లో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్ తో కలిసి పరిస్థితులను పరిశీలించి వర్షపు నీటి పారుదల, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై సమీక్షించారు. వర్షాకాలంలో ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మున్సిపల్ సిబ్బంది చేపట్టే చెత్త సేకరణ కార్యక్రమానికి సహకరించాలని, వర్షపు నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు ఏర్పడకుండా చూసుకోవాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, తద్వారా దోమల వ్యాప్తి, సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి అంజయ్య, మంచిర్యాల, పెద్దపల్లి, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల రీజినల్ మేనేజర్లు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్లు, బ్రాంచ్ మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు, బ్యాంక్ లింకేజ్ విభాగ అధికారులు, మెప్మా జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య ఘటనపై కలెక్టర్, ఎస్పీకి వినతి

**ఆసిఫాబాద్, జూలై 22, ప్రభాతవార్త :**

సిర్పూర్(టి) మండలం హీరాపూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ కొలవార్ యువకుడు టేకం పెంటయ్య (22) ఆత్మహత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ హరిత, జిల్లా ఎస్పీ నితికా పంత్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ కొలంవార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, తుడుందెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్స పోచయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, హీరాపూర్‌కు చెందిన పలు ఆదివాసీ కుటుంబాలు గత 40 ఏళ్లుగా సాగు చేస్తున్న భూములపై వివాదం నెలకొని నకిలీ పత్రాలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. భూమి వివాదం నేపథ్యంలో టేకం పెంటయ్య మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నారని, ఈ ఘటనకు కారణమైన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేసి భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతకుంట సర్పంచ్ అజ్మీర చత్రునాయక్, ఉపసర్పంచ్ గాజిరెడ్డి మోహన్, ఆదివాసీ కొలంవార్ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, తుడుందెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్స పోచయ్య


మాట్లాడుతున్న ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్

## సెల్‌ఫోన్ వినియోగంపై జిల్లా ప్రధానోపాధ్యాయులకు అవగాహన

**ఆసిఫాబాద్ టౌన్, జూలై 22, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో జిల్లా ప్రధానోపాధ్యాయులకు సెల్‌ఫోన్ వినియోగంపై ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆసిఫాబాద్ ఎస్హెచ్ఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్హెచ్ఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. చిన్న వయసులోనే సెల్‌ఫోన్ అలవాటు వ్యసనంగా మారి చదువుపై ప్రభావం చూపడంతో పాటు ప్రమాదాలు, నేరప్రవృత్తికి కూడా దారితీసే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా సెల్‌ఫోన్ వినియోగాన్ని నియంత్రించేందుకు తల్లిదండ్రులను చైతన్యపరచాలని కోరారు. అదేవిధంగా మహిళలు, బాలికలపై జరిగే వేధింపులు, అసాంఘిక ఘటనలపై వెంటనే 100 డయల్, షీ టీమ్కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్ కానిస్టేబుళ్లు స్వప్న, రజితతో పాటు జిల్లా ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రాణహిత పరివాహక ప్రాంతాలు పరిశీలిస్తున్న దృశ్యం

## భారీ వర్షాల వేళ అప్రమత్తతే ప్రాణరక్షణ: సీఐ ఆర్. కృష్ణ

**వేమనపల్లి, జూలై 22, ప్రభాతవార్త**

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నీల్వాయి, కోటపల్లి మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. కృష్ణ సూచించారు. ప్రాణహిత నది, వాగులు, వంకలు, చెరువులు, వరద నీటి ప్రవాహాల వద్దకు వెళ్లవద్దని, సెల్ఫీలు దిగడం, స్నానం చేయడం, చేపల వేటకు వెళ్లడం, వరద నీటిని దాటే ప్రయత్నాలు చేయవద్దని హెచ్చరించారు. పాత మట్టి ఇళ్లలో నివసిస్తున్న వారు గోడల్లో పగుళ్లు, పైకప్పు నుంచి నీరు కారడం, గోడలు వంగిపోవడం వంటి ప్రమాద సూచనలు కనిపిస్తే వెంటనే ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిపోయిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, తడిసిన చేతులతో విద్యుత్ పరికరాలను ముట్టుకోవద్దని తెలిపారు. చిన్నపిల్లలను నదులు, వాగులు, చెరువులు, వరద నీటి ప్రవాహాల వద్దకు వెళ్లనీయకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. వరద ముప్పు, ఇల్లు కూలే ప్రమాదం, తెగిపోయిన విద్యుత్ తీగలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు కనిపిస్తే వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతే పోలీసు శాఖ మొదటి ప్రాధాన్యమని, వర్షాకాలంలో ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండి అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని సీఐ ఆర్. కృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, కోటపల్లి ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

## ముత్యంపేటలో సహజ వ్యవసాయంపై రైతులకు అవగాహన

**- జాతీయ సహజ వ్యవసాయ మిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్ పిలుపు**

**కౌటాల, జులై 2, ప్రభాతవార్త**

కౌటాల మండలం ముత్యంపేట గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారి బి వెంకట్, కాగజ్‌నగర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మనోహర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సహజ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జాతీయ సహజ వ్యవసాయ మిషన్ కింద ముత్యంపేట గ్రామపంచాయతీ ఎంపిక కావడంతో పథకం ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్ మాట్లాడుతూ, రసాయన వ్యవసాయం వల్ల నేల ఆరోగ్యం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని, రైతులు సహజ వ్యవసాయ విధానాలను విస్తృతంగా అవలంబించాలని సూచించారు. అనంతరం రైతు బందురావు సాగు చేస్తున్న పచ్చి రొట్టె (జీలుగా) పంటను పరిశీలించి దాని ప్రయోజనాలను వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు మనోహర్ వెర్మి కంపోస్ట్, వెర్మి వాష్, జీవామృతం, నీమాస్త్రం, అగ్నాస్త్రం, దశపర్ణి కషాయం, వేప కషాయం వంటి సహజ వ్యవసాయ పద్ధతుల వినియోగంపై అవగాహన కల్పించి, వెర్మి కంపోస్ట్ యూనిట్‌ను సందర్శించి దాని ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. సాగర్, సర్పంచ్ ఉష, ఉప సర్పంచ్ రామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ సత్యనారాయణ, సీఆర్పీలు, వ్యవసాయ నిపుణులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


జీలుగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

## చికిత్స పొందుతూ కబడ్డీ క్రీడాకారుడు మృతి

**తాండూర్, జూలై 22, ప్రభాతవార్త :**

మండలంలోని కిష్టంపేట గ్రామ పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడాకారుడు బండి సాగర్ పాము కాటుతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. వారం రోజుల క్రితం సాగర్‌ను పాము కాటు వేయడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సాగర్ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సాగర్‌కు తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.సాగర్ మరణంతో కిష్టంపేట గ్రామంలో విషాదం అలుముకుంది.



మాట్లాడుతున్న తహసిల్దార్ జ్యోత్స్న

## ఎస్ఐఆర్‌పై సమీక్ష సమావేశం

**తాండూర్, జూలై 22, ప్రభాతవార్త :**

తాండూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎస్ఐఆర్ పై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జ్యోత్స్న మాట్లాడుతూ బిఎల్వోలు ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలన్నారు. ఓటర్లు ఎస్ఐఆర్ ఫారంలో వెంటనే తమ వివరాలు నింపి స్థానిక బిఎల్ఓలకు అందజేయాలని కోరారు. మండలంలో ఎస్ఐఆర్ వంద శాతం నమోదుకు బిఎల్వోలు, బిఎల్ఏలు, అన్ని రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, నాయక్ తహసిల్దార్ కల్పన, గిర్దావర్ పద్మజ, బిల్వోలు, బిఎల్ఏలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహాధర్నా పోస్టర్లు విడుదల చేస్తున్న తపస్ నాయకులు, ఉపాధ్యాయులు

## మహాధర్నా గోడపత్రికలు విడుదల

**తాండూర్, జులై 22, ప్రభాతవార్త :**

తాండూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఆగస్టు 1న నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన గోడపత్రికలను ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. తపస్ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి అశోక్ మాట్లాడుతూ పిఆర్సి అమలు చేయాలని, డిఏ బకాయిల విడుదల చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు ఓపిఎస్ అమలు చేయాలని, పెండింగ్ ప్రమోషన్లు తదితర సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మ్యాకం రమేష్ , ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు వినోద్ కుమార్, సభ్యులు అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సర్‌ను 100 శాతం పూర్తి చేయాలి

**బెజ్జూర్, జూలై 22, ప్రభాతవార్త:**



బెజ్జూర్ మండలంలో సర్ ప్రక్రియను 100 పూర్తి చేసేందుకు వివిధ రాజకీయ పక్షాల నాయకులు సహకరించాలని తహసిల్దార్ రామ్మోహన్ సూచించారు.ఇట్టి విషయమై బుధవారం తహసిల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.ఓటు హక్కును కలిగి ఉన్న ప్రతి ఒక్కరు సర్ పత్రాలను నింపి ఇవ్వాలని అన్నారు.ప్రభుత్వం ఇట్టి గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించినందున ప్రతి ఒక్కరు తప్పులు లేకుండా పూర్తి చేసి ఇవ్వాలన్నారు.మండలంలో ఇప్పటివరకు 85 ఈ ప్రక్రియ పూర్తయిందని,100 పూర్తికావడానికి సహకరించాలని కోరారు.సర్ పత్రాలను నింపి ఇవ్వనట్లయితే వారు ఓటు హక్కును కోల్పోతారని తెలిపారు.ఇట్టి విషయమై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి ఇప్పటివరకు పూర్తి చేయని వారికి అవకాశం ఉన్నందున అందరూ సర్ పత్రాలను పూరించి ఇచ్చే విధంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రోత్సహించాలని కోరారు.





# రక్తహీనతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**- యుక్తవయసులో బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం : గైనకాలజిస్ట్ డా. జ్యోతి**

**- 187 మంది విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు.. రక్తహీనత ఉన్న వారికి ఐరన్ మాత్రలు పంపిణీ**

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 22, ప్రభాతవార్త**

యుక్తవయసులో బాలికలు ఆరోగ్యంగా ఉంటే భవిష్యత్తులో ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలరని గైనకాలజిస్ట్ డా. జ్యోతి అన్నారు. రక్తహీనతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో సిర్పూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా స్పర్శ్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తహీనత నివారణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గైనకాలజిస్ట్ డా. జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. జ్యోతి మాట్లాడుతూ.. యుక్తవయసులో బాలికలు అన్ని విధాలా ఆరోగ్యంగా ఉండటం ఎంతో ముఖ్యమన్నారు. చిన్న వయసులోనే ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే భవిష్యత్తులో అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. విద్యార్థినుల్లో రక్తహీనతకు గల కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తహీనత నివారణకు అవసరమైన పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇలాంటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు విద్యార్థినుల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంచడంతో పాటు వివిధ అనారోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తించి నివారించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన మొత్తం 187 మంది విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో రక్తహీనత తక్కువగా ఉన్న విద్యార్థినులకు ఐరన్ మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ, స్పర్శ్ సోషల్ ఫౌండేషన్ సభ్యులు సుశీల, శివకుమార్, ఎస్పీయం ఆసుపత్రి సిబ్బంది రేఖ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండా ఆవిష్కరణ దినోత్సవంలో పాల్గొన్న వాసవి క్లబ్ సభ్యులు

## జాతీయ జెండా ఆవిష్కరణ దినోత్సవాన్ని నిర్వహించిన వాసవి క్లబ్

**ఆసిఫాబాద్, జూలై 22, ప్రభాతవార్త :**

జాతీయ జెండా ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పొట్టి శ్రీరాములు చౌక్‌లో జాతీయ జెండా స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షుడు మర్యాల ఉదయ్‌బాబు మాట్లాడుతూ భారత జాతీయ జెండా చరిత్రను వివరించారు. 1907లో కలకత్తాలో జాతీయ జెండాను ప్రదర్శించగా, 1931లో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో చరకా(రాట్నం) గుర్తుతో రూపొందించారని, అనంతరం చరకా స్థానంలో అశోక చక్రాన్ని ఏర్పాటు చేసి ప్రస్తుత త్రివర్ణ పతాకాన్ని స్వీకరించారని తెలిపారు. జాతీయ జెండా ఆవిష్కరణకు 79 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ సెక్రటరీ ఎకిరాల శ్రీనివాస్, చార్టెడ్ ప్రెసిడెంట్ గంధం శ్రీనివాస్, కౌన్సిలర్ చిలువేరు వెంకటేశ్వర్, క్లబ్ ప్రధాన కార్యదర్శి బాల శ్రీనివాస్, కోశాధికారి కలకుంట్ల శ్రీధర్, సభ్యులు వినోద్, కేదారి, విజయ్, కిష్టయ్య, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ఎం.వి.కె త్రీ ఇంక్లైన్‌ను సందర్శించిన కలెక్టర్

**తాండూర్, జూలై 22, ప్రభాతవార్త :**

తాండూర్ మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్ ను బుధవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత సింగరేణి అధికారులతో కలిసి ఓపెన్ కాస్ట్ స్థలాలు పరిశీలించి, ఓపెన్ కాస్ట్ కు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి ఏరియా జిఎం శ్రీరమేష్, తాండూర్ తహసిల్దార్ జ్యోత్స్న, సింగరేణి అధికారులు, తదితరులు ఉన్నారు.



## కల్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులు పంపిణీ

**కెరమెరి, జూలై 20, ప్రభాత వార్త:**

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్దిదారులకు మంజూరైనా కల్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కల్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పథకం నిరుపేదలకు వరంలాంటిదని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కల్యాణ లక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండునర సంవత్సరాలు అవుతున్న ఇచ్చిన హామీ ప్రకారం ఇంకా తులం బంగారం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఆడ బిడ్డలను సర్కారు మోసం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు, మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, తహసీల్దార్ నాగార్జున, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, నాయకులు యునుష్, దందు, రిజ్వాన్, సిడం ధర్ము, అరుణ్, రాంచందర్ కార్యకర్తలు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్‌లో పలువురి యువకుల చేరిక

**తాండూర్, జూలై 22, ప్రభాతవార్త :**

మండలానికి చెందిన పలువురు యువకులు బుధవారం తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీలో చేరినట్లు ఆ పార్టీ బెల్లంపల్లి ఇంచార్జ్ జనార్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ మండల కమిటీ ఇన్చార్జిగా గంధం మల్లేష్, మండల యూత్ కమిటీ ఇన్చార్జిగా దాసరి రుత్నక్ గౌడ్ లను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. టిఆర్ఎస్ లో చేరిన యువకులకు టిఆర్ఎస్ పార్టీ కండువను బోడ జనార్ధన్ కప్పి పార్టీలకు ఆహ్వానించారు.

